క్లుప్తంగా

ఆలయాలకు ప్రత్యేక బస్సులు

సత్యవేడు : పవిత్ర ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాలను దర్శించేందుకు భక్తుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకునే సదుపాయం ఉందని సత్యవేడు ఆర్టీసీ డీఎం వెంకటరత్నం తెలిపారు. శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం, వేలూరు బంగారు గుడి, వరదరాజ పెరుమాలయం, కాంచీపురం, వేణుగోపాల స్వామి దేవాలయం కార్వేటినగరం, నారాయణవనం, నాగలాపురం, సురుటుపల్లి, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం పెంచలకోన, శ్రీతల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం, నెల్లూరు–జొన్నవాడ కామాక్షి అమ్మవారి ఆలయం నరసింహకొండ, శ్రీనివాసమంగాపురం, వాల్మీకిపురం, తరిగొండ, కదిరి, సౌమ్యనాథ స్వామి ఆలయం నందలూరు, ఒంటిమిట్ట కోదండ రామాలయం, దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయం, పుష్పగిరి ఆలయ సముదాయం గండికోట, పైన తెలిపిన ఆలయాల సందర్శనకు ఆయా రూట్‌లలో బస్సుల బుకింగ్ కోసం 73828 82306 నంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ తెలిపారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

శ్రీకాళహస్తి : పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో బీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన సుధీర్‌బాబు, జగదీష్‌కు టీసీఎస్ పరిశ్రమలో గ్రాడ్యుయేట్ ట్రైనీలుగా ఎంపిక అయ్యారు. దీంతో మంగళవారం వారిని ప్రిన్సిపల్ నరసింహవర్మ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సతీస్‌కుమార్, గిరిజ, పరంధామయ్య, రాజేంద్రుడు, గంగారామ్ పాల్గొన్నారు.

సీపీఐ ఉత్సవాలను జయప్రదం చేద్దాం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి : సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దామని ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న శత జయంతి ఉత్సవాలు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని సీపీఐ అన్ని శాఖల్లో జెండాలను ఆవిష్కరించి, ర్యాలీ లు, సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తులసీరాజన్, గోపి, శ్రీనివాసులు, శివకుమార్, చారుశీల, గురవయ్య, మురళి, నరసింహారావు, ముని పాల్గొన్నారు.

తుపాన్ దెబ్బతో పంటలకు నష్టం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. వర్షాలు ఎక్కువగా పడుతుండటంతో వరి, మిరప పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షాల నేపథ్యంలో వరి పంటకు తెగుళ్లు సోకుతున్నాయని, దీంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా ఆరుతడి పంటలైన కాకర, మిరప పంటలు వర్షాలకు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


విద్యార్థుల అవగాహన ర్యాలీ..చిత్రంలో ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట సీఐ శరత్ చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్ వాడకంపై శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులతో హెల్మెట్ ధరించండి–రక్షణ పొందండి అంటూ నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శరత్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లే అనేక మంది మరణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అరుణ్‌కుమార్ రెడ్డి, సుధాకర్, ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ చారుమతి, ఏఓ మునిబాబు పాల్గొన్నారు.

ఆందోళనలో వేరుశనగ రైతులు

వరదయ్యపాళెం : మండలంలోని రైతులకు వర్షం బెడద వేధిస్తోంది. ఓవైపు ఎన్ను దశలో పంటకు మళ్లీ వర్షం వస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాజాగా 2 రోజుల కిందట వేరుశనగ పంటను సాగు చేసేందుకు విత్తనాలు విత్తారు. అయితే మంగళవారం ఉదయం నుంచి మరోమారు చిరుజల్లులు పడుతుండడంతో వేరుశనగ రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆ మేరకు మండలంలోని వెంగారెడ్డికండ్రిగ, చెన్నవారిపాళెం, తొండంబట్టు, పాండూరు ప్రాంతాల్లో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి


నారాయణవనం : పేద విద్యార్థులు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. మంగళవారం మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న ఎస్సీ సంక్షేమ వసతిగృహాన్ని ఎమ్మెల్యే, డీడీ చెన్నయ్యతో కలిసి సందర్శించారు. పాలమంగళం ఎస్సీ హాస్టల్‌లో రూ.7.70 లక్షలతో మంజూరైన పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయించడానికి కృషి చేయాలని ఆదేశించారు.

కనిపించని అస్త్రం..

నిస్తేజంలో స.హ.చట్టం

సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం.. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల కోసం చేసిన ఖర్చుల వివరాలు, కార్యాలయాలకు సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టానికి రూపకల్పన చేసింది. అయితే ప్రజలను చైతన్యం చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో చట్టం నిర్వీర్యంగా మారుతోంది. ఆ దశగా సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద సమాచార హక్కు చట్టం బోర్డుల ఊసే లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.

వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లతో స.హ.చట్టం బోర్డు



- కార్యాలయాల్లో అందుబాటులో లేని సమాచారం
- చట్టంపై అవగాహన కల్పించని అధికారులు
- అమల్లోకి వచ్చి 19 ఏళ్లు గడిచినా అంతంతే!
- ఏడాదిలో 100 మంది కూడా దరఖాస్తు చేయని వైనం
- అందుబాటులోని దరఖాస్తు ఫారాలు


బత్తలవల్లం హైస్కూల్ వద్ద సమాచారం లేని బోర్డు

వరదయ్యపాళెం : సమాచార హక్కు చట్టం 2005 మే 11న అమల్లోకి వచ్చింది. నియోజకవర్గంలో ఈ చట్టంపై ఇప్పటి వరకు 80 శాతం మందికి అవగాహన లేదు. చాలా మందికి ఈ చట్టం గురించి తెలియదు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. చట్టం అమల్లోకి వచ్చి నేటికి 19 ఏళ్లు పూర్తవుతున్నా ఈ చట్టం పూర్వాపరాలు ప్రజల్లోకి వెళ్లని పరిస్థితి నెలకొంది.

మొక్కుబడిగా సేవలు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ చట్టం గురించి కనీసం బోర్డులు ఏర్పాటు కాలేదు. అక్కడక్కడా మొక్కుబడిగా బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ అందులో ఉండాల్సిన సమాచారం అసలు కనిపించదు. సరాసరిన సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో కనీసం 100 మంది కూడా ఏడాదికి ఈ చట్టంను వినియోగించుకున్న దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. కార్యాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన బోర్డుల్లో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి పేర్లు సైతం సక్రమంగా నమోదు చేయడం లేదు. సంక్షేమ పథకాల పనితీరు గురించి తెలుసుకోవాలనే వారికి ఏ అధికారిని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇలా అంతటా నిర్లక్ష్యంగా ఈ చట్టంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది.

లొసుగులు బయట పడుతాయని..

స.హ.చట్టంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే అధికారులు చేపట్టే లొసుగులు బయట పడుతాయని ఓవైపు అధికారుల్లో అలజడి, మరోవైపు పనిభారం పెరుగుతుందని భావించి ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి శాఖల వారీగా నిర్ణీత కాలంలో అడిగిన పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పరిణామాలన్నీ అధికారులకు ఇబ్బందులు కలిగిస్తాయని వారు దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం లేదనే భావన వ్యక్తమవుతోంది.

అరకొర సమాచారంతో సరి

సమాచారానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వకుండా మొక్కుబడిగా అరకొర సమాచారంతో సరిపెడుతున్నారు. మరికొన్ని దరఖాస్తులకు అసలు స్పందించకుండానే దరఖాస్తు చేసుకున్న వారికి సర్ది చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు కావడం లేదు. ఇక దీని అమలును పర్యవేక్షించే అధికారులెవరో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి.

స్పందించని అధికారులు

వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీలో రెవెన్యూ శాఖకు చెందిన ఇంటి స్థలాల పంపిణీ రిజిస్టర్, వ్యవసాయ పాసు పుస్తకాల పంపిణీ రిజిస్టర్ల కోసం 2022 ఏప్రిల్‌లో అదే పంచాయతీకి చెందిన గుత్తి త్యాగరాజు దరఖాస్తు చేస్తుకున్నప్పటికీ నేటి వరకు సమాధానం లేదు.




సచివాలయం వద్ద ఎలాంటి సమాచారం లేని దృశ్యం, సమాచార బోర్డు లేని హౌసింగ్ కార్యాలయం

అవగాహన కల్పించాలి



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజలకు ఈ చట్టంపై అవగాహన ఉంటే ప్రభుత్వ పథకాల్లో అవకతవకలు జరగడానికి అవకాశం ఉండదు. కొన్ని శాఖల్లో అడిగిన సమాచారం సరిగా ఇవ్వడం లేదు. కార్యాలయాల్లో చట్టానికి సంబంధించి సమాచారం అందించే అధికారుల పేర్లను బోర్డుల్లో నమోదు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– గుత్తి త్యాగరాజు, పౌర మానవ హక్కుల సంస్థ రాష్ట్ర కార్యదర్శి

అవినీతిని అంతం చేసేందుకు..



ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకు సమాచార హక్కు చట్టం ఒక ఆయుధం లాంటిది. ఈ చట్టాన్ని ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించాలి. ఇతర వ్యక్తిగత లాభాపేక్ష పనులకు ఉపయోగించడం సరికాదు. కొందరు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

– పి. మార్కండేయ రెడ్డి, సీసీఆర్ రాష్ట్ర లీగల్ కమిటీ సభ్యుడు

క్రిస్మస్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి


బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : నియోజకవర్గంలో క్రిస్మస్ జరుపుకుంటున్న క్రైస్తవులకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఏసు మార్గంలో పయనిస్తూ తమ జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని కోరారు.


నూకతోటి రాజేష్, సత్యవేడు సమన్వయకర్త

వరదయ్యపాళెం : ఏసుక్రీస్తు జననం, జీవితం మానవాళికి సరైన సందేశమని నియోజకవర్గంలోని క్రైస్తవులందరూ ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగ జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

లాడ్జీ యజమానులు బాధ్యతగా ఉండాలి : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంటలోని లాడ్జీ యజమానులు బాధ్యతగా ఉంటూ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. రేణిగుంటలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లాడ్జీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి లాడ్జీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అధికంగా యాత్రికులు ఉండే ప్రాంతం కాబట్టి రూములు తీసుకునే వారి పూర్తి సమాచారాన్ని లాడ్జీ నిర్వాహకులు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సీఐ శరత్ చంద్ర, ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శత వసంతాల వేడుక..

కరుణామయుడి వేదిక

– చరిత్రకు సాక్ష్యంగా సత్యవేడు సీఎస్ఐ చర్చి


సత్యవేడులోని పురాతన సీఎస్ఐ చర్చి

సత్యవేడు : పంచాయతీలో సీఎస్ఐ చర్చి శత వసంతాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. నిరక్షరాస్యులకు అక్షరాలు దిద్దించిన భాషతో పాటు నాగరికతను నేర్పిన చరిత్ర ఈ చర్చి సొంతం. నియోజకవర్గ కేంద్రంలోని దళితవాడలో 1900 ప్రాంతంలో డీంగ్స్ దొర ఈ చర్చిని నిర్మించినట్లు ఆధారాలున్నాయి. బ్రిటీష్ హయాంలో ఇక్కడ పర్యటించిన మిషనరీలు ఈ ప్రాంత ప్రజలకు క్రీస్తు బోధనలతో పాటు సామాజిక సేవలను అందించారు. సత్యవేడుకు సమీపంలోని తమిళనాడు రోషన్ నగరంలో మిషనరీస్ ఆధ్వర్యంలో ఆస్పత్రి, రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించి పేదల బాధలను తీరుస్తూ డీంగ్స్‌దొర ప్రజలకు దగ్గరయ్యారు. డీంగ్స్‌దొర అనంతరం వచ్చిన కాటన్ దొర ఇక్కడ విద్యా వ్యాప్తికి విశేష కృషి చేశారు. పట్టణంలో సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాలను ప్రారంభించి నిరక్షరాస్యత నిర్మూలనకు తమ వంతు సహకారం అందించారు. ఈ పాఠశాలలో తొలి రోజుల్లో టీచర్లుగా పని చేసిన ఆడమ్స్, జ్ఞానకణ్ణు లాంటి వారు కరువు కాలంలోనూ ప్రజలకు అండగా ఉంటూ వైద్య సేవలు అందిస్తూ మనో ధైర్యాన్నిచ్చారు. చర్చి మొట్ట మొదటి పూర్తి స్థాయి పాస్టర్లుగా ఆంబ్రోస్, ప్రేమయ్య, జగన్నాథం పని చేయగా సంఘం పెద్దలుగా డేవిడ్ కుప్పన్, జాన్ విక్టర్ వ్యవహరించారు. పంచాయతీలో మూడు కుటుంబాలతో ప్రారంభమైన క్రైస్తవ సంఘం ప్రస్తుతం దాదాపు 22 దైవ సంఘాలతో అభివృద్ధి చెందింది.

క్రిస్మస్ శోభ


విద్యుత్ దీపాల అలంకరణలో కాంపాలెం చర్చి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని 36 చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు చర్చిలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. చర్చి లోపల రకరకాల ప్లాస్టిక్ పూలతో అలకరించారు. క్రిస్మస్ వేడుకలు నేటి నుంచి జనవరి1వ తేదీ వరకు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చర్చి నిర్వాహకులు తెలిపారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సంఘాల ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రార్థనలు, కేక్ కటింగ్ , ఏసు ప్రభువు సందేశాలు ఉంటాయని తెలిపారు.

ముందస్తు సంబరాలు


సంబరాల్లో చిన్నారులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని యూరో కిడ్స్ పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ , కరస్పాండెంట్ మునిలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకలకు ముస్తాబైన చర్చిలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమయ్యాయి. పట్టణ శివారులోని లూథరన్ చర్చి, పునితశౌరి చర్చిలను మంగళవారం సుందరంగా అలంకరించారు. చర్చిలో క్రీస్తు జననం వంటి దృశ్యాలను ఏర్పాటు చేశారు. బుధవారం జరిగే క్రిస్మస్ సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

వరదయ్యపాళెం : క్రిస్మస్ వేడుకలకు మండలంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. వరదయ్యపాళెం, సంతవేలూరు, రాచర్ల, బత్తలవల్లం, చిన్న పాండూరు, కంచరపాళెం, కాంబాకం, కారిపాకం, చిలమత్తూరు ప్రాంతాల్లోని చర్చిలు మంగళవారం నుంచే విద్యుత్ దీపాలతో పెద్దఎత్తున అలంకరణ చేశారు.






అలంకరణలో లూథరన్ చర్చి, పునీతశౌరి చర్చి, చిన్న పాండూరులో ముస్తాబైన పెంతేకోస్తు చర్చి

గిరిజన మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మహిళా మండలి ప్రతినిధులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : సెమీ క్రిస్మస్ సందర్భంగా రేణిగుంట మండలం గురవరాజుపల్లి ఎస్టీ కాలనీలోని గిరిజన మహిళలకు పద్మ మ హిళా మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ జూలియస్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జూలి యస్ రాజు మాట్లాడుతూ.. గిరిజనులకు ఎటువంటి సహాయం చేయడానికైనా మహిళా మండలి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సుబ్బమ్మ, శీను, అంగన్‌వాడీ కార్యకర్త ధరణి, నాగమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గొబ్బిదేవతకు ప్రత్యేక పూజలు


పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నరసింహస్వామి సేవలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి


పెద్దిరెడ్డికి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

నారాయణవనం : మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం మండలంలోని సింగిరికోన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఉదయం 11 గంటలకు సింగిరికోనకు చేరుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆలయ ట్రస్టీ సభ్యుడు భాస్కర్‌బాబు, అర్చకులు సాదరంగా ఆహ్వానం పలికారు. శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీనరసింహస్వామికి నిర్వహించిన ప్రత్యేక అర్చనలో పాల్గొన్న పెద్దిరెడ్డికి తీర్థ ప్రసాదాలను, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

పారిశుద్ధ్య పనులు మెరుగుపడాలి


దాసుకుప్పంలో ఇళ్ల వద్ద ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు : పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పడాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్ కోరారు. మంగళవారం సత్యవేడు, దాసుకుప్పం పంచాయతీలను పరిశీలించారు. రెండు పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులపై ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డితో కలిసి పంచాయతీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సత్యవేడు కళ్యాణ మండపం వీధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురుగు కాలువ సమీపంలో మలాథిన్ స్ప్రే చేశారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పిచికారీ చేశారు. రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. చెన్నేరి దాసుకుప్పంలో ఇంటింటికి వెళ్లి పగిలిన తొట్లు , నీటి కుండలు, ప్లాస్టిక్ పాత్రల్లో నీరు నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమలు నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, కార్యదర్శి ముని రవికుమార్, డాక్టర్ గుణశేఖర్, ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం, పారిశుద్ధ్య కార్మికులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్ కేటీ రోడ్


ధ్వంసమైన కేటీ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని శ్రీకాళహస్తి–తడ రోడ్డు మార్గంలోని ఎన్‌టీఆర్ నగర్ కాలనీ వద్ద రోడ్డుకు ఓ వైపు ధ్వంసమైంది. ఈ నెల 12వ తేదీన కురిసిన భారీ వర్షం నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రోడ్డు ఓ వైపున రెండు చోట్ల కోతకు గురై ధ్వంసమైంది. ఈ రోడ్డుపై రోజుకు వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. రోడ్డు ధ్వంసమై 10 రోజులు కావస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టకపోగా ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్లు కోతకు గురైయిన రోడ్డు కనపడకపోవడంతో వాహనాలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కోతకు గురైన కేటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోతున్నారు.

వసతిగృహాలకు మౌలిక వసతులు


హాస్టల్ వంట గదిని పరిశీలిస్తున్న సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నాగలాపురం : స్థానిక వెస్ట్ దళితవాడలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్యతో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారు. హాస్టల్ వార్డెన్‌తో కలిసి వంటగది, స్టడీ రూం, ఆఫీసు రూం, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 12 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు గాను రూ.1.03 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. మంజూరైన నిధులతో హాస్టల్‌లోని మౌలిక వసతులను విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొర్రై, ప్రజా ప్రతినిధులు, నాయకులు శ్రీనివాస యాదవ్, డాక్టర్ శేషాద్రి, శ్యామ్, ఎండీ కుమార్, దేశన్, మురళి పాల్గొన్నారు.